క్లుప్తంగా

నేడు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ ఆదివారం తెలిపారు. సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

రెండు లారీలు ఢీ

● డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు

అద్దంకి: ముందు వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటన మండలంలోని నామ్ రహదారిలో చక్రాయపాలెం హైస్కూల్ వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. ఈ ప్రమాదంలో పల్నాడు జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పి. శ్రీను, క్లీనర్ లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది క్షతగాత్రులను వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని పంచాయితీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పి.శివన్నారాయణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహిస్తున్న సమావేశానికి రెవెన్యూ సిబ్బంది విధిగా హాజరు కావాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థులు పుస్తకాలు చదటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు శాఖ గ్రంథాలయ అధికారి బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో విద్యార్థులకు చదవటం మాకిష్టం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో దేశభక్తి, దేశనాయకుల, నీతి కథలు, సైన్స్ పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కారుఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన శ్రీనివాసరావు

బల్లికురవ: బైక్‌పై రోడ్ క్రాస్ చేస్తుండగా కారు ఢీకొట్టటంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మేదరమెట్ల- నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని బల్లికురవ మండలంలోని వైదన బస్టాప్ వద్ద జరిగింది. అందిన సమాచారం ప్రకారం పల్నాడు జిల్లా నూజెళ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన కె. శ్రీనివాసరావు పని నిమిత్తం బైక్‌పై బల్లికురవ మండలంలోని వైదన గ్రామానికి వచ్చి తిరిగి వెళుతుండగా ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ఢీకొట్టింది. స్థానికులు బల్లికురవ 105 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఈయంటీ నాగార్జున బాషా ప్రాథమిక చికిత్స చేసి ఉన్నత చికిత్స కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

అన్నదాతకు దగా

● ఏడాదికి రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం
● ఖరీఫ్ ఆరంభమైనా జాడలేని అన్నదాత సుఖీభవ
● నియోజకవర్గంలో 22వేలకు పైగా రైతుల ఎదురు చూపు



విత్తనం వేయడం కోసం దుక్కి దున్నుతున్న రైతు

అద్దంకి: దేశానికి రైతే వెన్నుముక, రైతు కష్టించి పంటలు పండిస్తేనే దేశానికి, రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. ఆర్థికంగా స్థిరపడుతుంది. అటువంటి రైతుకు ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం కరువైతే అందరికీ ఇబ్బందులు వచ్చినట్లే. రైతు ప్రభుత్వం అని చెప్పుకొచ్చినా వారికి అందాల్సిన భరోసాను ప్రభుత్వాలు అందించలేకపోతున్నాయి. ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చకపోవడంతో సాయం కోసం దీనంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రైతుకు ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే రైతు భరోసా సాయం అందింది. దీంతో పెట్టుబడిలో కొంతలోకొంత రైతుకు ఉపయోగపడింది. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎన్నికలకు ముందు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కోరైతుకు రూ.20 వేలు సాయం అందిస్తామని చెప్పింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా, సుఖీభవ జాడే లేదు. ఈ సంవత్సరం ఆదిగో ఇదిగో అంటున్నా, ఖరీఫ్ ఆరంభమై జిల్లాలో 20 వేల ఎకరాల్లో కంది, మినుము, పెసర వంటి పంటలను రైతులు సాగు చేసినా సుఖీభవ డబ్బు రైతుల ఖాతాల్లోకి చేరలేదు.

రైతు భరోసా గతంలో ఇలా

ఏడాది	రైతులు	అందించిన మొత్తం (రూ)
2019-20	9543	15.74 కోట్లు
2020-21	10,245	61.69 కోట్లు
2021-22	7358	34.51 కోట్లు
2023-24	10,330	62.69 కోట్లు

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం రైతుకు అందేది. జూన్ మాసంతో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌కు మే నెలలోనే రూ.7,500 రైతుల ఖాతాలకు జమ అయ్యేది. రబీ సీజన్ ప్రారంభంలో అంటే అక్టోబర్‌లో రూ.4వేలు జనవరి నెలలో రూ.2 వేలు అందేది. ఈ సాయం భూమి కలిగిన రైతులతోపాటు, కౌలు రైతులకు అందింది.

ఏడాది గడిచినా అమలు కాని హామీ..

కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవ పథకం హామీ అమలు కాలేదు. ప్రతి రైతుకు రూ.20వేలు జమ చేస్తామని చెప్పి రూపాయి కూడా జమ చేయలేదు. ఇప్పటికే రైతుల నుంచి అవసరమైన సమాచారం తీసుకున్నా, సుఖీభవ ఇవ్వకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఈ సంవత్సరమైనా సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్నదాత సుఖీభవ ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికి సంవత్సరం గడిచినా ఒక్క రూపాయి జమ కాలేదు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు సాయం అందించాలి. మాట నిలబెట్టుకోవాలి. రైతులను ఆదుకోవాలి.

– గన్నమనేని వెంకటరామిరెడ్డి, కొప్పరపాలెం

ముగిసిన మెగా క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

యద్దనపూడి: పూనూరులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 11వ టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. పూనూరు వైఎంసీఏ ఆధ్వర్యంలో జూన్ 17 న ప్రారంభమైన టోర్నమెంట్ జూన్ 29 ఆదివారం వరకు ఉత్కంఠభరితంగా ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 40 జట్లు పాల్గొని తమ క్రికెట్ ప్రతిభను చాటాయి. మొదటి బహుమతి రూ 20,116 అనిల్ ఫ్రెండ్స్ యువత ఒమ్మెవరం జట్టుకు పోపూరి లింగయ్య అందజేశారు. రెండో బహుమతి రూ. 15,116 పూనూరు వైఎంసీఏ జట్టు గెలుపొందగా వీరికి మేక దేవసహాయం బహుమతి అందజేశారు. మూడో బహుమతి రూ. 10,116 యద్దనపూడి ఏవైఎఫ్ జట్టు గెలుచుకోగా వీరికి అల్లాడి వరప్రసాద్ నగదు అందజేశారు. నాలుగో బహుమతి రూ. 5,116 పూనూరు మాస్టర్ ఎలెవెన్స్ గెలుచుకోగా వీరికి రాయి వేణు బహుమతి అందజేశారు. టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన ప్రదర్శనతో తన జట్టుకు నిలువెత్తు మద్దతుగా నిలిచిన మణి తన బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యంతో అభిమానుల ప్రశంసలు అందుకున్నాడు. ఒమ్మెవరం మణి.. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ అందజేశారు. ఫైనల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఒమ్మెవరం డేవిడ్‌కు అందజేశారు.

మహిళ ఆత్మహత్య

మార్టూరు: తన కుమార్తె సంతానం తనకు దూరమైపోతుందనే మనస్తాపంతో అమ్మమ్మ అయిన ఓ మహిళ ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మార్టూరులో ఆదివారం సాయంత్రం జరిగింది. పాలపర్తి రత్తయ్య, గీత(45) దంపతుల కుమార్తె రమణి ఒంగోలు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తోంది. ఆమెకు చీరాలకు చెందిన క ట్టా శ్రీనివాస రావు తో సుమారు పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా రమణి, శ్రీనివాసరావు దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో విడివిడిగా ఉంటున్న క్రమంలో రమణి తన ఇద్దరు పిల్లలతో మార్టూరులోని పుట్టింట్లో ఉంటోంది. ఇటీవల కుల పెద్దలు రమణి, శ్రీనివాసరావు విడిపోయేటట్లుగా తీర్మానించారు. దీంతో తండ్రి శ్రీనివాస రావు తన పిల్లలను తీసుకొని చీరాల వెళ్లిపోయాడు. తన కుమార్తె సంతానం తనకు దూరం కావడంతో మనోవేదనకు గురైన గీత ఆదివారం సాయంత్రం తమ ఇంట్లోని గదిలో సీలింగ్ ఫ్యాన్ కి ఉరివేసుకొని మృతి చెందింది.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఆదిపూడిలో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

ఆదిపూడి (కారంచేడు): గ్రామాల్లో శాంతి, భద్రతలకు ఆటంకం, విఘాతం కలిగించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కారంచేడు, ఆదిపూడి గ్రామాల్లో విజబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రజలు పోలీసులతో స్నేహభావంతో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మీ సమస్యలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా పిర్యాదు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఏ ఒక్కరు ప్రజలకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించవద్దన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం చేయవద్దన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలకు గురవ్వద్దన్నారు. కారంచేడు-చీరాల రోడ్డులో కల్యాణ మండపం వద్ద ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. పత్రాలు లేని వాహన యజమానులకు ఆయన జరిమానాలు విధించారు.



కొప్పరపాడువద్ద బైకుపై వెళుతున్న మైనర్లు

మైనర్లూ జాగ్రత్త..

బల్లికురవ: మైనర్‌లకు బైకులు ఇవ్వద్దు అంటూ అధికారులు మొత్తుకుంటున్నా వాహన యజమానులు పట్టించుకోవటలేదు. ఆదివారం నార్కెట్‌పల్లి- మేదరమెట్ల నామ్ రహదారిలోని బల్లికురవ మండలంలోని కొప్పరపాడు గ్రామ సమీపంలో ముగ్గురు మైనర్లు బైక్‌పై తిరుగుతూ హల్‌చల్ సృష్టించారు. వివిధ పనులకై బస్సుల రాక కోసం నిరీక్షిస్తున్న వారు.. మైనర్లు బైక్‌పై చేస్తున్న విన్యాసాలు, అధిక వేగం చూసి హడలెత్తిపోయారు. రహదారిపై వ్యాపారాలు చేసేవారు. ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళన చెందారు. మైనర్లు అతివేగంతో అద్దంకి వైపు వెళ్లారు.

కరుణించు తల్లీ.. మమ్మేలు మాయమ్మ!



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



కారంచేడులో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కారంచేడు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, గ్రామ దేవత శ్రీ జగజ్జననీ గంగా భవానీ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు, విద్యార్థులు కాలేజీలు, పాఠశాలలకు వెళ్ళే సమయంలో ముందుగా అమ్మవారికి పూజలు చేసుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా అమ్మవారి ఆలయంలో గ్రామానికి చెందిన భక్తులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున ఆలయంలో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. పొంగళ్ళతో అలయంలో ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

సెక్యులర్, సోషలిస్టు పదాలు తొలగిస్తారా?



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కోట వెంకటేశ్వర రెడ్డి

చీరాల రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్టు అనే పదాలను తొలగించాలని ఇటీవల సంఘ పరివార్ నేత హోసబోలె వ్యాఖ్యానించడం దారుణమని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. అంతర్జాతీయ పార్లమెంటరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. 17 నుంచి 20వ శతాబ్దాల్లో జరిగిన మహోన్నమైన విప్లవాలు బ్రిటిష్ కాలంలోని సమాజంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అలానే 1857 సిపాయిల తిరుగుబాటు మొదలుకొని 1947 వరకు భారత స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ పోరాట ఘట్టాలు, వందలాదిమంది త్యాగధనులైన నాయకులున్నారని చెప్పారు. రాజనీతి శాస్త్రంలో ప్రధానాంశం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్టు అనే పదాలను తొలగించాలని ఇటీవల సంఘపరివార్ నేత హోసబోలె చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా వివాదాస్పదమయ్యాయని తెలిపారు. రాజ్యాంగం సుభిక్షంగా ఉంటేనే దేశ ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ అత్తలూరి రామారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మార్పు గ్రగోరి, గోలి జేజిబాబు, మంకెన మణిబాబు, రాజశేఖర్, చిన్నబాబు, సుభాని, శ్రీనివాసరావు, సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

దర్శి(కురిచేడు): ప్రమాదవశాత్తు గడ్డి వామి దగ్ధమై రూ. 30 వేల ఆస్తినష్టం జరిగిన సంఘటన దర్శి నగరపంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏరువ విజయమ్మకు చెందిన రెండు ఎకరాల్లోని వరిగడ్డి వామి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయింది. అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించటంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ. 30 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితురాలు విజయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.


రోటరీ క్లబ్‌కు 5 పతకాలు



అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ సభ్యులు

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ కు ఆదివారం అరుదైన గౌరవం దక్కింది. 202425 ఆర్థిక సంవత్సరానికి గాను ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో 3150 రోటరీ జిల్లా పరిధిలో చేసిన సేవలకు గాను ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా మార్టూరు రోటరీ క్లబ్‌కు ఒక బంగారు పతకం మూడు వెండి పతకాలు, ఒక ఇత్తడి పథకంతో పాటు మూడు మెమొంటోలు, ఆరు ప్రశంస పత్రాలను రోటరీ 3150 జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి చేతుల మీదుగా మార్టూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు అందుకున్నారు. మార్టూరు రోటరీ క్లబ్ తరపున ప్రధానంగా రోటరీ కళాపరిషత్ నిర్వహణ, బాలికా విద్య, ఉచిత కుట్టు శిక్షణ ద్వారా మహిళా సాధికారతకు తోడ్పడటం, దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు ఉచిత పంపిణీ, దోమల నిర్మూలన, తదితర అంశాలపై ప్రజలకు సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారాలకు ఎంపికైనట్లు రోటరీ గవర్నర్ శరత్ చౌదరి ప్రకటించారు. కార్యక్రమంలో మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, ఎం. సాంబశివరావు, రావి అంకమ్మ చౌదరి, చెన్నుపాటి బసవ రాములు, తదితరులు పాల్గొన్నారు.

రోటరీకి గోల్డెన్ చాంపియన్ అవార్డులు



పురస్కారాలు అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకికి రోటరీ 3150 జిల్లాలోనే ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు రెండు గోల్డెన్ చాంపియన్ అవార్డులు, మూడు సిల్వర్ అవార్డులు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని కొంపల్లి గౌరిక్ ఫంక్షన్ హాలులో జరిగిన అవర్డ్స్ ప్రదానోత్సవంలో కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎక్కువ రక్తదానాలు చేయించిన రోటరీక్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావుకు స్పెషల్ అవార్డు, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) కు పిల్లర్ ఆఫ్‌ది క్లబ్ అవార్డుతో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, అద్దంకివీ ప్రసాద్, సందిరెడ్డి శ్రీనివాసరావు, అలహరి హరిప్రసాద్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ రామకోటేశ్వరరావు, అంజాద్ బాషా, కాకర్ల వెంకటేశ్వర్లు, సంకాబాబు, బొమర్తి గురుశేఖర్, తమ్మన శ్రీనివాసరావు, జాగర్ల ముడి శివకుమారి, కోట అంజమ్మ, కుంచాల శ్రీవిద్య, పాల్గొన్నారు.

పెరిగిన చీరల వేలం ఆదాయం

పర్చూరు(చినగంజాం): పర్చూరు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి చీరల వేలం నిర్వహించారు. ఆలయం ఎండోమెంట్ అధికారి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారి మొత్తం 144 చీరలను వేలం వేశారు. చీరల వేలంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు. గత ఏడాది చీరాల వేలంలో ఆలయానికి రూ. 23,150 రాగా, ఈ ఏడాది రూ. 32,395లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం సచివాలయం సమీపంలో ఉన్న సిమెంటు బల్లపై ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు మేదరమెట్ల పోలీసులు ఆదివారం గుర్తించారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల పురుషుడుగా భావిస్తున్నారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు మేదరమెట్ల ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా



సముద్రంలో కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తున్న పర్యాటకులు



వాడరేవులో డ్రోన్ కెమెరాతో పర్యాటకుల రక్షణ చర్యలు తీసుకుంటున్న రూరల్ ఎస్సై చంద్రశేఖర్

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో చీరాల, పర్చూరు, గుంటూరు, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటు, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. సముద్రపు అలలతో కేరింతలు కొడుతూ స్నానాలు చేస్తూ సముద్రపు మన్నుతో ఆటలాడుకుంటూ సరదాగా గడిపారు. తీరంలో ఆదివారం సండే సందడి నెలకొంది.

పోలీసు పహారా..

మండలంలోని పర్యాటక ప్రాంతాలైన వాడరేవు, రామాపురం, తదితర సముద్ర తీర ప్రాంతాలు పోలీసుల భద్రత పహారాలో ఉన్నాయి. తీరం మొత్తం పోలీసుల నిఘాలో ఉండటంతో పాటు నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు వారాంతపు సెలవు రోజులు, పర్యాటకులు అధికంగా వచ్చే రోజుల్లో సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలతో భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం చీరాల రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ డ్రోన్ కెమెరాతో తీరం మొత్తం రికార్డు చేశారు. అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా చేయడంతో పాటు సముద్రంలో లోపలికి వెళ్లకుండా గజ ఈతగాళ్లతో పహారా, పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.